

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 26-06-2025 | సంపుటి - 24 | సంచిక - 54 | రూ : 4 | పేజీలు: 8





## ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి సై

- ఎలైన్‌మెంట్‌కు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- ఇక పూర్తిస్థాయి డీపీఆర్‌పై దృష్టి

**జూన్ 25, హైదరాబాద్ :** కేంద్రం చేపట్టే ప్రాంతీయ వలయ రహదారి (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తరభాగం పనులకు సమాంతరంగా దక్షిణభాగం పనులను చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉత్తరభాగంలో నాలుగు లైన్ల రహదారికి గతంలో టెండర్లు పిలవగా రాష్ట్ర సర్కారు ఆరు లైన్లకు విస్తరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. దీంతో మరోసారి ట్రాఫిక్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే నివేదిక, కేంద్ర మంత్రిమండలి

తరువాయి 2లో

## మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు

- 30 రోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేయాలి
- సెప్టెంబరు 30కల్లా ఫలితాలు వెల్లడించాలి
- ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

**జూన్ 25, హైదరాబాద్:** పంచాయతీ ఎన్నికల ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలంటూ ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నెల రోజుల్లోగా వార్డు సభ్యులు/సర్పంచుల రిజర్వేషన్లను ఖరారు చేసి, ఎన్నికల సంఘానికి సమ్మతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలియజేసిన రెండు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి.. సెప్టెంబరు 30లోగా ఫలితాలను వెల్లడించాలని ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ మాజీ సర్పంచులు పార్వతి (నల్గొండ

తరువాయి 2లో







## మే నుంచి కాజీపేటలో రైలు కోచ్‌ల ఉత్పత్తి

- అందుబాటులోకి రానున్న 'మెము' రైళ్లు
- రైల్వే మంత్రితో కిషన్‌రెడ్డి సమావేశం

**జూన్ 25, హైదరాబాద్:** కాజీపేటలోని రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్‌ఎంయూ) నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని.. జనవరి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2026 మే నెలలో కాజీపేట ఆర్‌ఎంయూలో మెయిన్ లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (మెము) కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభం అవుతుందని తెలిపారు. కేంద్ర గనుల శాఖ మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మంగళవారం రాత్రి దిల్లీలో అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. తెలంగాణకు సంబంధించిన వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు.

తరువాయి 2లో

## పర్యాటక ప్రాంతంగా కర్రెగుట్టలు



- రహదారులు, హోటళ్ల నిర్మాణానికి కేంద్రం ప్రణాళిక
- అతిపెద్ద సాయుధ బలగాల శిక్షణ కేంద్రం ఏర్పాటుకూ యోచన

**జూన్ 25, హైదరాబాద్ :** ఇప్పటి వరకూ మావోయిస్టులకు పెట్టనికోటలా ఉన్న కర్రెగుట్టలను అతిపెద్ద పర్యాటక ప్రాంతంగా మార్చాలని కేంద్రం భావిస్తోంది. దట్టమైన అడవి, సెలయేళ్లు, గుహలు, కొండలతో సహజ సుందరమైన ఈ ప్రాంతాన్ని మరింత అందంగా, పర్యాటకులకు అనుకూలంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ఉన్న కేంద్రం ప్రత్యేక ప్రణాళిక

తరువాయి 2లో



## మళ్లీ ఆ పాలన రానివ్వం.. పెట్టుబడులు పెట్టండి

- ఈసారి ఏమరుపాటుగా లేను
- ఎన్డీయే ప్రభుత్వమే కొనసాగుతుంది
- ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు
- రూ.500 నోట్లూ రద్దుచేయాలి
- అప్పడే ఎన్నికల్లో డబ్బు పంపిణీ తగ్గుతుందని వ్యాఖ్య

2లో

## ఫీజులు పెంచుకోవడానికి తప్పుడు లెక్కలా?

- అలాంటి ఇంజినీరింగ్ కాలేజీలపై కేసులు పెట్టండి
- పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ ప్రారంభించాలి
- విద్యాశాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

2లో



## యోగాంధ్ర అద్భుతం

- ఈ కార్యక్రమ విజయాన్ని అందరూ అధ్యయనం చేయాలి
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీ
- ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు ప్రశంస
- విశాఖలో కలిగిన అనుభూతి మరెక్కడా రాలేదని వెల్లడి

**జూన్ 25, దిల్లీ:** అంతర్జాతీయ యోగా దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ మరోసారి ప్రశంసించారు. బుధవారం కేంద్రమంత్రివర్గ సమావేశంలో ఆయన గత వారంలో తాను పాల్గొన్న దేశ, విదేశీ పర్యటనలు, ఇతర అధికారిక కార్యక్రమాల గురించి వివరించే సందర్భంలో యోగాంధ్ర గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇందులో కీలకపాత్ర పోషించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రి లోకేశ్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు. ''యోగాంధ్ర ఊహించని విధంగా జరిగింది. ఇప్పటివరకూ నేను ఎన్నో కార్యక్రమాలు చూశాను. కానీ యోగాంధ్రలా క్రమశిక్షణతో సాగిన అతిపెద్ద కార్యక్రమాన్ని చూడలేదు. చంద్రబాబునాయుడు, లోకేశ్‌లు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని చేయడం

తరువాయి 2లో

# యోగాంధ్ర అద్భుతం

(మొదటిపేజీ తరువాయి)

అభినందనీయం. నెలరోజులపాటు ఓ కార్యక్రమాన్ని వినూత్నంగా, విజయవంతంగా కొనసాగిస్తూ రావడం మరచిపోలేని అంశం. 30 రోజులపాటు సమాజంలోని అన్ని వర్గాలవారినీ కలుపుకొంటూ యోగాంధ్రను ఎలా నిర్వహించారో వివరిస్తూ నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని అడిగాను. ఆ నివేదిక వచ్చిన తర్వాత అధ్యయనం కోసం అన్ని రాష్ట్రాలకూ పంపుతాను. ఒక మంచి కార్యక్రమాన్ని విజయవంతంగా ఎలా నిర్వహించాలనేది చంద్రబాబు, లోకేశ్‌లు చేసి చూపించారు. దీన్ని మిగతావారంతా ఆదర్శంగా తీసుకోవాలి. ఈ కార్యక్రమానికి రెండు గిన్నిస్ రికార్డులతోపాటు పలు రికార్డులు రావడం సంతోషంగా ఉంది. ఈ విజయాన్ని అందరూ అధ్యయనం చేయాలి. గత 11 ఏళ్లలో అనేకచోట్ల యోగా, ఇతర కార్యక్రమాలకు హాజరైనా విశాఖలో వచ్చిన అనుభూతి ఎక్కడా రాలేదు'' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ విషయాలను పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మీడియాతో పంచుకున్నారు.

# మే నుంచి కాజీపేటలో రైలు కోచ్‌ల ఉత్పత్తి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా వైష్ణవ్ మాట్లాడుతూ.. రైల్వే ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు మెము రైళ్లను త్వరలోనే ప్రవేశపెట్టనున్నట్లు కిషన్‌రెడ్డికి వివరించారు. 1620 కోచ్‌లు ఉండే మెము రైళ్లను.. గ్రామీణ ప్రాంతాలు, సెమీఅర్బన్ ప్రాంతాలకు అనుసంధానించడంతో పండగల సమయంలో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని రైల్వేమంత్రి స్పష్టం చేశారు. రూ.716 కోట్లతో ఆర్‌ఎంయూ నిర్మాణ పనుల్ని ఏడు నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

# మళ్లీ ఆ పాలన రానివ్వం.. పెట్టుబడులు పెట్టండి

'వైకాపా పాలన చేదు అనుభవాలను మరచిపోయి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి. నేను ఈసారి ఏమరుపాటుగా లేను. ఎన్డీయే ప్రభుత్వమే ముమ్ముందూ కొనసాగేలా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నా. నాదీ భరోసా. నిర్భయంగా పెట్టుబడులు పెట్టండి' అని పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. విజయవాడ నోవోటెల్‌లో బుధవారం జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయంగా ఆర్థికవ్యవస్థ ఎలా ఉంది, దేశంలో ఆర్థిక సంస్కరణలకు ముందు, తర్వాత పరిస్థితులు, ఐటీ రంగం అభివృద్ధి, భవిష్యత్తులో అమరావతి ఎలా ఉండబోతోంది? క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ ఆధారిత అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్‌ను ఎలా అభివృద్ధి చేయబోతున్నదీ ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించి చెప్పారు. అన్ని సాంకేతికతలనూ మేళవించి అందమైన గ్రీన్‌ఫీల్డ్ నగరంగా అమరావతిని రూపుదిద్దుతున్నామని, వందేళ్ల తర్వాత కూడా అమరావతిని తలదన్నేలా ఎవరూ నగరాన్ని నిర్మించలేరని చంద్రబాబు ఘంటాపథంగా పేర్కొన్నారు. 'సంపద పెరగాలి, ఆ సంపదతో సంక్షేమం అందించాలి. సంపన్నులు పేదలను దత్తత తీసుకుని వారి సర్వతోముఖాభివృద్ధికి మార్గదర్శులుగా ఉండాలి' అని చంద్రబాబు ఉద్బోధించారు. రూ.500 నోట్లనూ రద్దుచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 'వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే ఎక్కువ ప్రోత్సాహకాలిస్తాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. పెట్టుబడిదారులు అందిపుచ్చుకోవాలి. రాయలసీమలో గ్రీన్‌ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, హైటెక్, ఏరోస్పేస్ రంగాలకు అవకాశం ఉంది. విశాఖకు గూగుల్ వస్తోంది. సింగపూర్ నుంచి విశాఖకు సీ కేబుల్ వేస్తున్నాం. కెమికల్, ఫార్మా, టూరిజం, ఉక్కు పరిశ్రమల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాలో ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు అవకాశం ఉంది. అమరావతిలో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, ఇన్నోవేషన్స్ వంటి అంశాలపై దృష్టిపెడుతున్నాం. వినోదరంగంలోనూ అమరావతిలో అనేక అవకాశాలు సృష్టిస్తున్నాం' అని చంద్రబాబు వివరించారు.

**ఎన్నికల్లో డబ్బు పంపిణీ చేస్తే అన్నీ సమస్యలే**

'దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికల్లో డబ్బుల పంపిణీ అధికంగా ఉంది. ఎన్నికల కోసం రాజకీయపార్టీలు ప్రజలకు డబ్బులు పంచుతున్నాయి. మళ్లీ ఆ డబ్బు తిరిగి పొందేందుకు అన్ని వ్యవస్థలనూ నేతలు కలుషితం చేస్తున్నారు. అందుకే మొదటినుంచీ నేను డిజిటల్ కరెన్సీని ప్రోత్సహిస్తున్నా. ఇప్పుడున్న రూ.500 నోట్లూ రద్దుకావాలి. రూ.100, రూ.200 నోట్లే ఉండాలి' అన్నారు. 'క్వాంటం కంప్యూటింగ్ భవిష్యత్తులో అత్యంత కీలకంగా మారుతుంది. టెక్నాలజీతో సామాన్యుడికి సేవలు అందించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందొచ్చు. టెక్నాలజీతో నేరాలు కట్టడి చేయవచ్చు. అనేకమంది పోలీసులతో ప్రస్తుతం నిర్వహిస్తున్న నిఘాను ఒక డ్రోన్ సాయంతో పూర్తిచేయవచ్చు. అన్ని సేవలూ టెక్నాలజీతో అనుసంధానమవుతాయి. టెక్నాలజీతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటే వైద్యఖర్చులూ తగ్గుతాయి. ప్రజారోగ్యం విషయంలో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నాం' అని సీఎం చెప్పారు.

**సమాజానికి సాయం చేయాలి**

'ఆర్థిక అసమానతలను తొలగించేందుకు పారిశ్రామికవేత్తలు, సమాజం నుంచి సంపాదించినవారు ముందుకు రావాలి. మిలియన్, ట్రిలియన్ డాలర్ల ఆస్తిపరులు ఒకవైపు ఉంటే... పూటగడవని నిరుపేదలు మరోవైపు ఉన్నారు. పేదరికాన్ని పారదోలాల్సిన బాధ్యత విధాన నిర్ణేతగా నాపై ఉంది. ఈ అసమానతలు తొలగేలా పనిచేస్తున్నాం. సమాజంలో ఆర్థిక అసమానతలు పోయేలా చేయడమే మా ప్రభుత్వ ప్రధాన బాధ్యత. ఇందుకు పి4 విధానాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఇందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలి. పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారికి సాయం చేయాలి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**విధానాల సాకారం వల్లే అధిక వృద్ధి**

ఫిక్కీ అధ్యక్షుడు, ఇమామీ లిమిటెడ్ వీసీఎండీ హర్షవర్ధన్ అగర్వాల్ మాట్లాడుతూ.. 202425లో రాష్ట్ర ఆర్థికవృద్ధి రేటు 8.2%గా దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, చంద్రబాబు విధానాలు సాకారమవుతున్నాయని చెప్పేందుకు ఇది నిదర్శనమన్నారు. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో భారత్‌లోనే మొట్టమొదటి సారిగా క్వాంటం వ్యాలీ టెక్‌పార్కు ఏర్పాటవుతోందన్నారు. ఇక్కడ క్వాంటం కంప్యూటింగ్‌కు అంకురార్పణ చేస్తున్నారన్నారు. పారిశ్రామిక విధానం 4.0, ఎంఎస్‌ఎంఈ విధానాలు 4.0, క్లీన్ ఎనర్జీ పాలసీ 4.0 వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో ఫిక్కి పూర్తిస్థాయిలో సహకరిస్తుందని చెప్పారు. ఫిక్కీ ఉపాధ్యక్షుడు, ది సాన్మార్ గ్రూపు ఛైర్మన్ విజయ్ శంకర్ మాట్లాడుతూ.. రెండు రాజధానులు నిర్మించే అరుదైన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. రాష్ట్రంలో 15% వృద్ధి రేటుకు.. 2047 నాటికి దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా నిలవాలన్న ఆకాంక్షకు ఫిక్కీ మద్దతుగా నిలుస్తుందన్నారు. ఫిక్కీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఛైర్మన్, ఎన్‌ఎస్‌ఎల్ గ్రూప్ ఛైర్మన్ ఎం.ప్రభాకరరావు మాట్లాడుతూ.. మొత్తం 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు నెలకొల్పడం, రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటుతో రాష్ట్రంలో సాగుతున్న ప్రగతిని ప్రస్తావించారు. ఫిక్కీ డైరక్టర్ జనరల్ జ్యోతి విజ్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా మల్లేపల్లి), శ్రీనివాస్ (కుర్మపల్లి), విజయ్ (జనగామ జిల్లా కాంచనపల్లి), అనిల్‌కుమార్ (నిర్మల్ జిల్లా తల్వేద), మురళీధర్ (కరీంనగర్ జిల్లా) తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారించిన జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. "2024లో పిటిషన్లు మొదటిసారి విచారణకు వచ్చినపుడు ఓటర్ల జాబితాను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోరినట్లు ఎన్నికల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బీసీల రిజర్వేషన్ల వర్గీకరణకు 3 నెలల గడువును ప్రభుత్వం కోరింది. అనంతరం మరో వాయిదాలో 2024 డిసెంబరులోపు ప్రక్రియ పూర్తవుతుందని కోర్టుకు హామీ ఇచ్చింది. అనంతరం ఈ పిటిషన్‌లు బెంచ్ ముందుకు విచారణకు రాలేదు. ప్రస్తుత విడత విచారణ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలోని ఐదు దశలకుగాను మూడు పూర్తయ్యాయని, మరో రెండు దశలు మాత్రమే మిగిలి ఉన్నాయని ఎన్నికల సంఘం తెలిపింది. బీసీ రిజర్వేషన్‌లపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసి, నివేదిక తెప్పించి వర్గీకరణ చేపట్టడం వల్ల ఎన్నికలను సకాలంలో నిర్వహించలేకపోయామని ప్రభుత్వం పేర్కొంది. 2024 జనవరి 31తో పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం పూర్తయింది. పాలకవర్గాల పదవీకాలం ముగిసేలోగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సిన రాజ్యాంగ బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సమ్మతి తెలియజేయాల్సి ఉంది. అంతేగాకుండా ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను కల్పించి, ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణలో 14 నెలల ఆలస్యం జరిగిందన్నది కాదనలేని సత్యం. అయితే ఆలస్యం సమర్థనీయమా, కాదా అన్న అంశాల్లోకి లోతుగా వెళ్లకుండా ఎన్నికల ప్రక్రియలో నాలుగో దశ అయిన వార్డు సభ్యులు/సర్పంచుల రిజర్వేషన్‌లను ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం సమంజసమని ఈ కోర్టు భావిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రభుత్వం 20 రోజుల గడువు కోరినప్పటికీ... 30 రోజులు ఇవ్వడం సముచితమని భావిస్తోంది. 30 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి... ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఎన్నికల సంఘానికి సమ్మతి తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాం. ప్రభుత్వం సమ్మతి తెలియజేసిన 60 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి చేయాలి. తీర్పు ప్రతి అందిన మూడు నెలల్లో ఈ ప్రక్రియను మొత్తం పూర్తి చేసి సెప్టెంబరు 30లోగా ఎన్నికల ఫలితాలను వెల్లడించాలి" అని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు.

# ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి సై

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదం తర్వాత ఉత్తర భాగం టెండర్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఆ లోపు దక్షిణభాగానికి సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కన్సల్టెన్సీ సంస్థను కూడా నియమించింది. దక్షిణభాగం ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఇటీవలే ఆమోదం తెలిపింది. మూడు ప్రతిపాదనలను పరిశీలించాక.. 201 కిలోమీటర్ల మేర ఈ భాగాన్ని నిర్మించాలని నిర్ణయించింది. పూర్తిస్థాయి డీపీఆర్ వచ్చిన తర్వాత కేంద్రానికి సమర్పించి పనులు చేపట్టాలని కోరనుంది. అందుకు కేంద్రం అంగీకరించకపోతే రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టడానికి సిద్ధమవుతోంది. ఉత్తరభాగం 161.51 కి.మీ., దక్షిణ భాగం 201 కి.మీ. కలిపి ప్రాంతీయ వలయ రహదారి మొత్తం 362.51 కి.మీ. మేర నిర్మించనున్నారు. ఆరు వరుసలుగా నిర్మించే దక్షిణభాగంపై అధికారులు మంత్రి మండలికి సమర్పించిన నివేదికలో ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

* మంత్రి మండలి ఆమోదిత ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలిలా..
* యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు మొత్తం 201 కి.మీ. రహదారిని 'గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే'గా అభివృద్ధి చేయనున్నారు.
* యాదాద్రి భువనగిరి, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా నిర్మాణం జరగనుంది.
* సంస్థాన్ నారాయణపూర్, మర్రిగూడెం, కేశంపేట, బాలానగర్, షాబాద్ వంటి ప్రధాన ప్రాంతాల మీదుగా ఈ రహదారి వెళ్లనుంది.
* ఎన్‌హెచ్65, ఎన్‌హెచ్44, ఎన్‌హెచ్ 163, ఎస్‌హెచ్19, ఎన్‌హెచ్ 76లను కలుపుతుంది.
* ఈ మార్గంలో ఎక్కడా గుట్టలు, కొండలను తొలవాల్సిన అవసరం లేదు.
* గంటకు 120కి.మీ వేగంతో వాహనాలు ప్రయాణించేలా రహదారిని అభివృద్ధి చేయనున్నారు.
* మొత్తం 55 నివాస ప్రాంతాలను ప్రభావితం చేసే ఈ రహదారికి 2,010 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుంది.
* దీని పరిధిలో రెండు రైల్వే క్రాసింగ్ ప్రాంతాలను గుర్తించారు. 22 ప్రాంతాల్లో విద్యుత్ హెచ్‌టీ లైన్లు ఉన్నాయి.
* ఇండస్ట్రియల్ పార్కులు, సెజ్‌లకు సమీపం నుంచి వెళ్లేలా ఎలైన్‌మెంట్ ఏర్పాటు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఆదిభట్ల ఏరోసిటీ ప్రాంతాలను కవర్ చేసేలా ప్రణాళిక.
* భారత నౌకాదళ రాడార్ స్టేషన్, కొంగరకలాన్ ఎకో టూరిజం, ఇతర పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానత ఉండేలా నిర్మాణం.
* ఓఆర్‌ఆర్‌కు 40 కి.మీ. పరిధిలో ఆర్‌ఆర్‌ఆర్ రానుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం (హెచ్‌ఎంఆర్) పరిధిలోకి వచ్చే విధంగా ఎలైన్‌మెంట్.
* ప్రాంతీయ రింగ్ రైల్‌ను ప్రతిపాదిస్తే పారిశ్రామికాభివృద్ధికి దోహదపడే రవాణా వలయంగా రూపుదిద్దుకోనుంది.

# పర్యాటక ప్రాంతంగా కర్రెగుట్టలు

(మొదటిపేజీ తరువాయి)

రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు దేశంలోనే అతిపెద్ద సాయుధ బలగాల శిక్షణ కేంద్రంగా కూడా మార్చాలనే ఆలోచనతో ఉంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో ఆదివారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో జరిగిన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశంలో దీనిపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

**ఊటీ తరహా వాతావరణం**

తెలంగాణఛత్తీస్‌గఢ్ మధ్య కర్రెగుట్టలు విస్తరించి ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని చెబుతున్న కేంద్రం కర్రెగుట్టల్లో దాగిన మావోయిస్టుల అగ్రనేతల ఆచూకీ కనిపెట్టడానికి ఇటీవల పదివేల మంది బలగాలతో 21 రోజులపాటు భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈ క్రమంలో జరిగిన ఎదురు కాల్పుల్లో 30 మంది వరకూ మావోయిస్టులు మరణించారు. మిగిలిన వారు ఇక్కడి నుంచి తప్పించుకున్నారని పోలీసులు భావిస్తున్నారు. దీన్ని ఇలానే వదిలేస్తే భవిష్యత్తులో మళ్లీ మావోయిస్టులు జొరబడే అవకాశం ఉందని భావిస్తున్న కేంద్రం పర్యాటక ప్రాంతంగా మార్చాలని ప్రణాళిక రచిస్తోంది. వేసవిలోనూ ఇక్కడ ఊటీ తరహాలో వాతావరణం ఉంటుందని, పర్యాటకానికి కావాల్సిన అన్ని హంగులూ ఉన్నాయని, అందుకే దేశంలోనే అతిపెద్ద పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా చేయాలని భావిస్తోంది. భారీ రహదారులు నిర్మించడం, పర్యాటకానికి అవసరమైన హోటళ్లు, ఇతర హంగులు కల్పించడానికి ప్రణాళిక రూపొందిస్తోంది. అలానే భవిష్యత్తులో మళ్లీ మావోయిస్టులు ఇటువైపు రాకుండా ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున భద్రతా బలగాల కోసం ఫార్వర్డ్ ఆపరేషన్ బేస్(ఎఫ్ఓబీ)లు కూడా నిర్మించబోతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఇక్కడున్న ప్రత్యేకమైన భౌగోళిక పరిస్థితులను ఆసరాగా చేసుకొని సాయుధ బలగాల కోసం అతిపెద్ద శిక్షణ కేంద్రం కూడా ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

*** మావోయిస్టుల ఏరివేత బాధ్యత కేంద్ర బలగాలకే**

దేశంలో మావోయిస్టుల ఏరివేతను పూర్తిగా కేంద్ర బలగాలు నిర్వహించనున్నాయి. స్థానిక పోలీసుల ప్రమేయం లేకుండా ఇక మీదట పూర్తిగా సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ వంటి బలగాలకే ఈ బాధ్యత అప్పగించాలని కేంద్రం నిర్ణయించింది. దాంతోపాటు పోలీస్‌స్టేషన్ల వారీగా మావోయిస్టుల కదలికలు గమనించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని, ఇదంతా కేంద్రం పర్యవేక్షణలోనే జరగాలని కూడా నిర్ణయించారు.

# ఫీజులు పెంచుకోవడానికి తప్పుడు లెక్కలా?

హైదరాబాద్: ఫీజులు పెంచుకునేందుకు.. తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ)కి తప్పుడు పత్రాలు అందజేసిన ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలపై కేసులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం విద్యాశాఖపై సీఎం మూడు గంటలకుపైగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ ఫీజులపై చర్చించినట్లు సమాచారం. కొన్ని కళాశాలలు అధ్యాపకులకు ఎక్కువ మొత్తంలో వేతనాలు ఇచ్చినట్లు, నిర్వహణ పనులకు అధికంగా ఖర్చు చేసినట్లు టీఏఎఫ్ఆర్‌సీకి తప్పుడు లెక్కలు సమర్పించాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఫీజుల పెంపును టీఏఎఫ్ఆర్‌సీ కమిటీ ప్రాథమికంగా నిర్ధారించి.. అందుకు యాజమాన్యాలు సమ్మతించినట్లు వారి సంతకాలు కూడా తీసుకుంది. ఈ విషయమై ముఖ్యమంత్రి సమీక్షలో అధికారులకు స్పష్టత ఇచ్చారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్.. టాస్క్‌ఫోర్స్ అంటూ ఇంజినీరింగ్ కళాశాలలను తనిఖీ చేయించినా, కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోయారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించినట్లు సమాచారం. కొందరు విద్యను వ్యాపారంగా మార్చుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. "గత సర్కారు తీరులా కాకుండా మనం కొండను తవ్వాలి.. కళాశాలల దందాను నియంత్రించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గరాదు. విద్యారంగంలో అవినీతి మరక కనపడవద్దు. రాష్ట్రంలో సాంకేతిక విద్య దేశానికి ఆదర్శంగా మారాలి. అందుకు అవసరమైన ప్రక్షాళన చర్యలు చేపట్టాలి'' అని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం.

*** న్యాయపరమైన సమస్యలు రాకుండా కౌన్సెలింగ్**

ఈసారి పాత ఫీజులతోనే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఇప్పటికే ఆదేశించిన సీఎం.. తాజాగా మరోసారి అదే విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. ఎవరైనా కోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నందున.. న్యాయపరమైన సలహాలు తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్ష ముగిసిన అనంతరం సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన.. అడ్వొకేట్ జనరల్‌ను, ఇతర న్యాయ నిపుణులను సంప్రదించారు. కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన క్రమంలో.. ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖ అధికారులు చర్చించి షెడ్యూల్‌ను



విడుదల చేయనున్నారు. ప్రవేశాల కమిటీ ఛైర్మన్ అయిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని సీఎం సమీక్ష సమావేశానికి ఆహ్వానించకపోవడం చర్చనీయాంశమైంది.

*** ఐఏఎస్‌లూ.. బడులను సందర్శించాలి: సీఎం**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని లక్ష్యం విధించారు. ఐఏఎస్ అధికారులందరూ బడులతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో 48 వేల మంది చేరారని అధికారులు చెప్పగా.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన తరగతి గదులు నిర్మించాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలూ పెరుగుతున్నందున వారికి వసతులు కల్పించాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్మీడియట్/తత్సమాన కోర్సుల్లో చేరేలా చూడాలని నిర్దేశించారు. ఇంటర్మీడియట్ అనంతరం నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందితే వారి జీవనోపాధికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు కట్టెల పొయ్యి బాధల నుంచి విముక్తి కల్పించాలని.. సోలార్ కిచెన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత, జేఎన్‌టీయూ హెచ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఓబి లో బి రిజిస్టర్ ప్రకారం స్థానికులకే అవకాశం ఇవ్వాలి

**: ఐ ఎఫ్ టి యు డిమాండ్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలో కొత్తగా రాబోతున్న ఓబీ సౌదా కంపెనీ స్థానికులకు అవకాశం ఇవ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎస్ సి సి డబ్ల్యూ యు,ఐఎఫ్ టియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎండి రాసుద్దీన్,ఏ వెంకన్నలు అన్నారు. కొత్తగూడెం రైటర్ బస్తి ఐఎఫ్టియు కార్యాలయం లో రీజియన్ ఉపాధ్యక్షులు కామ్రేడ్ మోత్కూరి మల్లికార్జున రావు అధ్యక్షులు జరిగిన ఈ జనరల్ బాడీలో వారు ముఖ్యవక్తులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి నిబంధనలు ఉల్లంఘిస్తూ స్థానికేతరులకు ఎక్కువ అవకాశం కల్పిస్తే ఆ కంపెనీలపై పోరాటం తప్పదని పిలుపునిచ్చారు. సింగరేణిలో లేని కొత్త ఆనవాయితీని ఈ సౌదా కంపెనీ తీసుకొస్తూ ఉందని ఇది రేపు మిగతా ప్రైవేటు ఓబి కంపెనీలకు కూడా అలవాటు అయ్యే ప్రమాదం ఉందని దీన్ని తక్షణమే ఉపసంహరించుకొని పాత పద్ధతిలోనే రిక్రూట్మెంట్ కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు.కొత్తగూడెం ఓపీలు 600 మంది కార్మికులు గతంలో భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారి అక్కడ ఓబీలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి కార్మికులు ఈనాడు ప్రైవేట్ ఏజెన్సీ రూపంలో అప్లై చేసుకోండి అంటే అక్కడ ఉన్న వారందరికీ చదువు రాదని ఎక్కడైతే ఓపెన్ కాస్ట్ తీస్తున్నాము అక్కడే ఉండి ఆధారాలు సేకరించాలని వారన్నారు.సౌదా కంపెనీ స్థానికులకు అందరికి అవకాశాలుయాలని బి రిజిస్టర్ ప్రకారం అవకాశాలు కల్పించాలని వారు అన్నారు. 2019 తర్వాత ఖాళీగా ఉండటం వల్ల వీళ్లకు వీటిసి మెడికల్ లేదని అప్లికేషన్లు తీసుకొని వీటిని మెడికల్ ఆ కంపెనీ ఏర్పాటు చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ సి సి డబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు,కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్ సంజీవ్, మోత్కూరి మల్లికార్జునరావు,వాసు,అశోక్, శ్రీనివాస్, చందర్,సురేష్,రమేష్ వెంకన్న,రాజు,విజయ్, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ లో 'సంవిధాన్ హత్యా దివస్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఎమర్జెన్సీ విధించి, కాలానికి యాభై ఏళ్లు నిండిన సందర్భంగా బుధవారం ప్రగతినగర్ లో రాజ్యాంగ హత్యా దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో అమరులైన వారికి జోహారులర్పించారు. ఆర్ఎస్ఎస్ అయోధ్య రామ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించి అక్రమంగా అరెస్టు కాబడి జైలుకెళ్లిన మాగంటి విశ్వనాథ్, నిడసనమెట్ల రంగా రావు, లక్ష్మిరాజు శివ ప్రసాద్ తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండ, అక్రమ నిర్బంధాల గురించి, ఇందిరా గాంధీపై హల వ్యతిరేకతను ప్రతిబింబించే ఒక సంఘటనను వివరించారు బస్ లో తను దిగవలసిన చోట దిగడానికి నిరాకరించిన ఒక మహిళతో కండక్టర్, "అక్కడ ఆమె(ఇందిర) దిగదు, ఇక్కడ నువ్వు దిగవు! ఎలా అమ్మా మీతో!" అన్నాడు. తరువాత ఆ కండక్టర్ ను సస్పెండ్ చేశారు. అంతటి వ్యతిరేకత ఉండేది ఇందిర పైన అని తెలియజేశారు. అనంతరం వారిని స్వయంసేవకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ రామారావు, అల్వాల దేవేందర్ రెడ్డి, సత్య కాటేపల్లి, రామ్ కిశోర్, దాట్ల వెంకటపతి రాజు, డాక్టర్ వెంకన్న, రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్, కమల్, భారతి, హరి, రవికిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ని పరామర్శించిన పీర్జాదిగూడ మాజీ మేయర్



జనగామ, (ప్రజాస్ఫూర్తి) : గత కొద్ది రోజుల క్రితం కాలుకు గాయమై హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స చేసుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ని బుధవారం పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి లతో పాటు సీనియర్ నాయకులు పల్లా రాజేశ్వర్ రెడ్డిని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి,బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మల్లం వెంకటేష్ గౌడ్ లు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు లంచం డిమాండ్.. ఏసీబీ వలలో కల్వకుర్తి రెండో ఎస్సై

వెల్దండ: నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై2గా పనిచేస్తున్న ఎం.రామచందర్ జి.. ఏసీబీ అధికారులకు బుధవారం రాత్రి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన వెంకటయ్య, అతని సోదరుడికి మధ్య నెలకొన్న భూవివాదంపై జూన్ 23న కేసు నమోదైంది. ఈ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై 2 రామచందర్ జి.. వెంకటయ్యను రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అతను మంగళవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బాధితుడు మహబూబ్‌నగర్ కూడలి నుంచి ఫోన్ చేయగా పోలీస్ స్టేషన్‌కు రమ్మని చెప్పి.. ఆవరణలో రూ. 10వేలు ఎడమ చేతితో తీసుకుని ఎడమ జేబులో పెట్టుకుని పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్లి కూర్చున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఏసీబీ అధికారులు వెంటనే స్పందించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడు ఎం. రామచందర్ జిని గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## విద్యార్థి దశలోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించాలి

*** టూ టౌన్ సీఐ ప్రతాప్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థి దశలోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించడం సమాజం యొక్క ప్రధాన బాధ్యత అని టూ టౌన్ సీఐ ప్రతాప్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచనల తో టూ టౌన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ అవగాహన వారోత్సవాల సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ లోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్ లో విద్యార్థులకు డ్రగ్స్ పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టూ టౌన్ సీఐ ప్రతాప్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమైన సందేశం అందించారు. ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని, అన్నారు. చుట్టూ జరుగుతున్న అనైతిక కార్యకలాపాల గురించి వారిలో అవగాహన పెంచాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల ప్రభావం ఇప్పుడు పల్లె ప్రాంతాలకూ విస్తరించిందనీ, వీటి నుంచి యువతను కాపాడుకోవాలి" అని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు రవాణాకు సులభ మార్గాలనీ, విద్యార్థులు,యువత వీటికి బలవుతున్నారనీ,మత్తులో ఉన్న వ్యక్తి తన చర్యల్ని గుర్తించలేని స్థితికి చేరతాడనీ,ఈ అలవాటు అనేక ఆరోగ్య సమస్యలతో పాటు నేరపూరిత జీవితానికి దారితీస్తుందని అన్నారు. సరదా కోసం అయినా డ్రగ్స్ వైపు అడుగు వేయకండనీ,ఇవి కేవలం వ్యక్తిని కాదు, కుటుంబాన్నీ నాశనం చేస్తాయని తెలిపారు. డ్రగ్స్‌కి బలైపోకుండా మీ భవిష్యత్తును కాపాడుకోనీ విజేతలుగా ఎదగండి" అంటూ విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోలీసులు ముందుగానే తీసుకుంటున్న జాగ్రత్త చర్యలు, ప్రజల్లో విస్తృత అవగాహన పెంచే కార్యక్రమాలు అభినందనీయంగా నిలుస్తున్నాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

## పార్టీ అభివృద్ధికి నిరంతరం కష్ట పడతా


*** గాంధీభవన్ లో టీపీసీసీ జనరల్ సెక్రటరీ గా నాగా సీతారాములు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్ గాంధీ భవన్ లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ భట్టి విక్రమార్క ఇటీవల నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ విధి విధానాలకు కట్టుబడి ఉంటానన్నారు. పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకుని సమిష్టిగా ముందుకు వెళ్తానని, కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు వస్తుంది అని చెప్పడానికి తానే నిదర్శనమన్నారు. స్టూడెంట్ ఆర్గనైజేషన్ నుండి మొదలై మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ఎన్నో ఒడిదుడుకులు, ఒత్తిళ్ళు, అవమానాలు, అరెస్టులు, ఉద్యమాలు అన్ని చూసుకుంటా కేవలం పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం కోసం గత 3 దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ లోనే కొనసాగిన తనకు గతంలో టీపీసీసీ మెంబెర్ గా ఇప్పుడు టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పార్టీ అవకాశం ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీ ఆశావాహుడిగా ఉండి తనకు టికెట్ దక్కనప్పటికి అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ఎన్నికల్లో పార్టీ లైన్ దాటకుండ ప్రచారం చేసిన వ్యక్తిత్వం తనదన్నారు. కష్టపడి పని చేస్తే అధిష్టానం గుర్తుంచి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మహా వృక్షమని, ఆ నీడలో అందరం కలిసి సమిష్టిగా పని చేస్తామని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భాద్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, చైర్ పర్సన్ సోనియా గాంధీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘు రాంరెడ్డి , రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరిలకు, నాగా సీతారాములు కృతజ్ఞతలు తెలిపారు.

## అందాల ముద్దుగుమ్మలతో "ఎలివ్" డైమండ్స్ మొదటి షోరూం ప్రారంభం

**- హాజరైన మిస్ యూనివర్స్ తెలంగాణ 2025 మిస్ కశ్వి, మిసెస్ ఇండియా 2024 డా. ప్రీతి అడుసుమిల్లి**




హైదరాబాద్ 25 జూన్ (ప్రజా స్ఫూర్తి) : నూతన శైలిలో లగ్జరీని పరిచయం చేస్తూ, "ఎలివ్" డైమండ్స్ బ్రాండ్ హైదరాబాద్‌లో మొట్ట మొదటి షోరూం ని లాంచ్ చేసింది. తిబరుమల్ జ్యువెల్స్‌కు చెందిన ఈ ప్రీమియం డైమండ్ బ్రాండ్ ఫ్లాగ్‌షిప్ షోరూంను కోకాపేటలో ఘనంగా ప్రారంభించారు. మిస్ యూనివర్స్ తెలంగాణ 2025 మిస్ కశ్వి & మిసెస్ ఇండియా 2024 విజేత డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బ్రాండ్ ప్రతినిధులు పంకజ్ గుప్తా, త్రిశాంక్ గుప్తా & అభిరాం అగర్వాల్‌తో పాటు షోరూం సిబ్బంది ఈవెంట్ లో పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో 'చార్మినార్ కలెక్షన్' ఆవిష్కరించారు. హైదరాబాద్ స్థాపనానికి ప్రతీకగా నిలిచే చార్మినార్ స్ఫూర్తితో, ఈ కలెక్షన్‌ను ప్రముఖ డిజైనర్ పంకజ్ గుప్తా రూపొందించారు. ప్రతి ఆభరణం హస్తకళతో తయారు చేయబడిందని, ఎలాంటి మాస్ ప్రొడక్షన్ జరగదని "ఎలివ్" డైమండ్స్ పేర్కొంది. ప్రతి ఆభరణం ప్రత్యేకంగా ఉంటుంది - నాజూకుగా, సొగసుగా ఉంటుంది. సంస్థ లాభాల్లోని కొంత భాగాన్ని 'బేటీ బచావో, బేటీ పడావో' ఉద్యమం మరియు హస్తకారుల సంక్షేమానికి కేటాయిస్తామని "ఎలివ్" డైమండ్స్ యాజమాన్యం తెలిపింది. భవిష్యత్‌లో బంజారాహిల్స్, కోంపల్లీ, వరంగల్, కోయంబత్తూర్ అలాగే అంతర్జాతీయంగా యునైటెడ్ స్టేట్స్ వంటి ప్రదేశాల్లో విస్తరణను లక్ష్యంగా పెట్టుకుంది "ఎలివ్" డైమండ్స్.

## ఇల్లందు సీఐ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లందు లో భార్య భర్తల మధ్య వివాదం కేసులో భర్త తల్లీదండ్రులతో దురుసుగా ప్రవర్తించి వారి హక్కులకు భంగం కలిగించినందులకు గాను మల్టీ జోన్ 1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఇల్లందు సీఐ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. పోలీసు అధికా రులు గానీ,సిబ్బంది గానీ ఎవరైనా పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో అమర్యాదగా ప్రవర్తిస్తే శాఖా పరమైన విచారణ జరిపి క్రమశిక్షణా చర్యలు తప్పవని ఈ సందర్భంగా తెలియజేసారు.

## ఏసీబీ అదుపులో మరో సింగరేణి ఉద్యోగి

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో ఉద్యోగాల పేరుతో అక్రమాలకు పాల్పడిన ముఠా లో మరోకర్ని ఖమ్మం ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్. సాదర్ల ప్రశాంత్.జనరల్ మజ్దూర్.(కాకతీయ ఖని 1వఇంక్లైన్..) ని భూపాలపల్లి లో బుధవారం అరెస్ట్ చేశారు. గతంలో ఇదే కేసుకి సంబంధించి రాజేశ్వరరావు, కడాలి చైతన్యను ఇప్పటికే ఏసీబీ అదుపులోకి తీసుకుంది. మొత్తం ఈ చైన్ లింకును లోతుగా విచారిస్తున్నారు. త్వరలోనే మరికొన్ని అరెస్టులు జరిగే అవకాశాలు ఉన్నాయని సింగరేణి కార్మిక వాడ ప్రాంతంలో హాట్ హాట్ గా చర్చ జరుగుతుంది.

## మునగ తోటల నిర్వహణపై రైతులకు కీలక సూచనలు

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో నవంబర్‌డిసెంబర్ మాసాల్లో నాటిన మునగ తోటలు ప్రస్తుతం పూత , కాయల దశలో ఉండటంతో, ఈ దశలో సరైన పర్యవేక్షణ లేకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రైతులకు సూచించారు. పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉండేందుకు రైతులు తీసుకోవలసిన చర్యలపై వ్యవసాయ శాఖ నిపుణులతో కలిసి కలెక్టర్ చర్చించారు.ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు కీలక సూచనలు చేశారు:

**నీటి నిల్వ నివారణ**

వర్షాకాలంలో తోటల్లో నీరు నిలవకుండా చూడాలి. మీరు నిల్వ ఉంటే మొక్కల వేర్లు కుళ్ళిపోవడం, తెగుళ్లు వ్యాపించడం జరుగుతుంది కాబట్టి నిల్వకుండా చేయాల్సిన అవసరం ఉంటుంది. దానికిగాను ఉపాధి హామీ పథకం కింద 12x12 మీటర్ల నీటి కుంటలు తవ్వించుకోవాలి. లేకపోతే రైతులు స్వయంగా చిన్న గుంటలు (3x3 మీటర్లు) తవ్వి నీరు పారేలా చర్యలు తీసుకోవాలి అన్నారు.

**తేమ నిర్వహణ**

వర్షాల మధ్య ఎండలు పడటం వల్ల తోటలో తేమ లోపించే అవకాశం ఉంది. కాయల దశలో తేమను నిలుపుకోవడం అత్యవసరం. తేమ/నీరు సరైన స్థాయిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి .

**ఎరువుల వినియోగం**

పుష్పోత్పత్తి ,కాయల అభివృద్ధి దశలో మొక్కలకు పశువుల ఎరువు (510 కేజీలు), యూరియా (100 గ్రా), పొటాష్ (50 గ్రా) ఇవ్వాలి. లేదా డ్రిప్ ద్వారా నీటిలో కరిగే ఎరువులు 19:19:19 లేదా 13:0:45 వారానికి ఒకసారి ఇవ్వాలని సూచించారు.

**కలుపు నివారణ**

పోషకాలు కలుపులకు పోకుండా, ప్రతి వారం తోట పరిశీలించి కలుపును తొలగించాలి.

**పురుగు నియంత్రణ**

ఆకులను తినే గొంగళి పురుగుల నియంత్రణకు (15 రోజులకు ఒకసారి) వేప కషాయం పిచికారి చేయాలి. అవసరమైతే నిపుణుల సూచనల మేరకు ప్రకటించు, ప్రతినిధి, కొరాజెం వంటివి వినియోగించాలి.

**తెగుళ్ల నివారణ**

ఆకుమచ్చ తెగుళ్ల నియంత్రణకు వేప నూనె 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. లేదా కార్బెండజిమ్, మాంకోజెబ్ వంటి మందులు నిపుణుల సలహాతో వాడాలని సూచించారు .రైతులు ఈ సూచనలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు మరిన్ని వివరాల కోసం మండల వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చు అని తెలిపారు.ప్రతి మండల వ్యవసాయ అధికారి (ఏవో), విస్తరణ అధికారి (ఏ ఈ ఓ) గ్రామస్థాయిలో ఈ సూచనలను విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల సందేహాల నివృత్తికి అధికారుల అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# కేసీఆర్ వల్లే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు: కవిత

* **ఆరు గ్యారెంటీల అమలుపై అసెంబ్లీలో చర్చకు రావాలని రేవంత్ కు కవిత సవాల్**
* **మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపణ**
* **గోదావరి జలాలను చంద్రబాబుకు రేవంత్ గిఫ్ట్ గా ఇచ్చారని విమర్శ**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు తీరు, మహిళలకు చేసిన వాగ్దానాలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. ఇదే సమయంలో, పెన్షన్ల పెంపుదల వంటి హామీలను నెరవేర్చాలని కోరుతూ ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీకి పోస్టుకార్డులు పంపే ఉద్యమానికి ఆమె శ్రీకారం చుట్టారు. గోదావరి జలాల అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసరడంపై కవిత స్పందిస్తూ... "యస్.. అసెంబ్లీలో కచ్చితంగా చర్చిద్దాం. అయితే, ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసిన అంశాలపై కూడా చర్చ జరగాలి" అని డిమాండ్ చేశారు. కేసీఆర్ దమ్ము ఏమిటో అసలైన కాంగ్రెస్ పార్టీకి తెలుసు కాబట్టే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ వచ్చింది కాబట్టే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగలిగారని ఆమె అన్నారు. ఈ విషయాన్ని విస్మరించి రేవంత్ రెడ్డి మాట్లాడటం బాధాకరమని, ఆయన మరింత హుందాగా వ్యవహరించాలని సూచించారు. చంద్రబాబును రేవంత్ పిలిచి హైదరాబాద్ బిర్యానీ తినిపించి, గోదావరి నీళ్లను కానుకగా ఇచ్చారని కవిత ఆరోపించారు. రేవంత్ రెడ్డికి అబద్ధాలు చెప్పడం పరిపాటిగా మారిందని, 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదని ఆమె వ్యాఖ్యానించారు. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం తలపెట్టరని కవిత స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరని ఆమె హెచ్చరించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ సంతకంతో కూడిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారని కవిత గుర్తు చేశారు. సోనియా గాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆమె ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీల ప్రకారం పెన్షన్ల మొత్తాన్ని పెంచేలా సీఎం రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వేలాది పోస్టుకార్డులను సోనియా గాంధీకి పంపుతున్నామని తెలిపారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ.2 వేల పెన్షన్ ను రూ.4 వేలకు పెంచుతామన్న హామీని విస్మరించారు. వికలాంగుల పెన్షన్ ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచకుండా మోసం చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీ ఏమైంది?" అని కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ హామీలన్నింటినీ తక్షణమే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ పోస్టుకార్డుల ఉద్యమం ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తామని కవిత పేర్కొన్నారు.

## తెలంగాణ లాసెట్ ఫలితాలు విడుదల..



తెలంగాణలో ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్, పీజీఎల్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి బుధవారం మధ్యాహ్నం విడుదల చేశారు. జూన్ 6న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లాసెట్, పీజీ ఎల్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది లాసెట్‌కు మొత్తంగా 57,715 మంది దరఖాస్తు చేసుకోగా.. 45,609 మంది హాజరయ్యారు. మూడేళ్ల ఎల్ఎల్బీకి 32,118 మంది, ఐదేళ్ల ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎంకు 13,491 మంది చొప్పున అభ్యర్థులు ఈ పరీక్ష రాశారు. ఇటీవలకీ విడుదల చేసిన అధికారులు తాజాగా ఫలితాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

## బస్సులో ఏనుగు దంతాలు తరలిస్తుండగా.. వ్యక్తి అరెస్టు



హైదరాబాద్: బస్సులో ఏనుగు దంతాలు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శేషాచల అడవుల నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయానికి యత్నించగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మహర్షి వద్ద రూ.3కోట్ల విలువ చేసే రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం రాచకొండ పోలీసులు గాలిస్తున్నారు.




## 'మాదకద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు'.. నెక్లెస్ రోడ్‌లో ర్యాలీ

హైదరాబాద్: మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నెక్లెస్ రోడ్ జలవిహార్ వద్ద 'మాదకద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, పలువురు అధికారులు పాల్గొన్నారు. నగరవాసులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని సందడి చేశారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు సర్కార్ గుడ్ న్యూస్



రోడ్డు ప్రమాద బాధితులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలియ జేసింది. ప్రమాదం జరిగిన వారంలోపు రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు నేడు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స అమలుపై హైదరాబాద్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు నగదు రహిత చికిత్స అమలు సాధ్యాసాధ్యాలపై అధికారులతో పొన్నం ప్రభాకర్ చర్చించి, పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. రోడ్డు ప్రమాదం జరిగిన బాధితులకు వారంలోపు వారికి అయ్యే చికిత్సా ఖర్చు రూ.1.5 లక్షల వరకు ప్రభుత్వం భరిస్తుందని వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు స్పందించాలని, ప్రమాద వివరాలు, క్షతగాత్రుల వివరాలు ఈదార్ లో నమోదు చేయాలని అన్నారు. ఈ వివరాల ఆధారంగా వారి చికిత్స ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. అయితే ఆయుష్మాన్ భారత్ కింద నమోదైన ఆసుపత్రుల్లో మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపిన పొన్నం.. రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్సపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారం..

## స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్

* **బీఆర్ఎస్ సామాజిక మాధ్యమ ప్రచారాలు పూర్తిగా అవాస్తవమన్న టీపీసీసీ చీఫ్**
* **గత ప్రభుత్వం ఎన్నికల కోసమే పథకాలు తెచ్చిందని వ్యాఖ్య**
* **పదేళ్ల బీఆర్ఎస్ అభివృద్ధిని 18 నెలల్లోనే చేసి చూపించామన్న టీపీసీసీ చీఫ్**
* **కాంగ్రెస్ పాలనలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని వెల్లడి**
* **గోదావరి-బనకచర్ల అంశంపై సమగ్ర అధ్యయనం తర్వాతే నిర్ణయం**



బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు ఎంత మాత్రం విశ్వసించవద్దని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. "కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో సాగుతున్న సామాజిక న్యాయం మరే ప్రభుత్వ హయాంలోనూ జరగలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే పథకాలను ప్రవేశపెట్టింది. దీనికి నిదర్శనమే హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో హడావుడిగా దళితబంధు పథకాన్ని తీసుకురావడం" అని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతంగా పరిపాలన అందిస్తోందని, దీనిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు సామాజిక మాధ్యమాల్లో కట్టుకథలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి కంటే, కేవలం 18 నెలల తమ కాంగ్రెస్ పాలనలోనే ఎక్కువ అభివృద్ధి చేసి చూపించామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. "పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పరిస్థితి ఏమిటో, వారి పాలనలో రాష్ట్రం ఎంత నష్టపోయిందో ప్రజలందరికీ బాగా తెలుసు. రాష్ట్ర ప్రజల అవసరాలను, రాష్ట్ర హక్కులను గత ప్రభుత్వం పూర్తిగా తాకట్టు పెట్టింది" అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన అంశంపై తమ ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేస్తోందని, అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే దీనిపై ఒక స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజలకు వాస్తవాలు వివరించి, భారాస చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## దేశ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజు: డీకే అరుణ

* **స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదన్న డీకే అరుణ**
* **రెండు ఎకరాల రైతులకు కూడా రైతు భరోసా అందడం లేదని విమర్శ**
* **ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్**



తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ధైర్యం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆమె ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమంపై గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రెండు ఎకరాల భూమి ఉన్న చిన్న రైతులకు కూడా రైతు భరోసా అందించడంలో విఫలమైందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు భరోసా పేరుతో సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని, ఇది కాంగ్రెస్ నేతలకే తెలియాలని ఆమె అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని, అందుకే ఎన్నికల నిర్వహణలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీజేపీ నాయకులందరూ బాధితులేనని డీకే అరుణ తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. అదేవిధంగా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కూడా సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు కీలకమైన అంశాలపై సీబీఐ విచారణ కోరడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందో చెప్పాలని ఆమె నిలదీశారు. జూన్ 25వ తేదీ భారతదేశ చరిత్రలోనే ఒక చీకటి రోజని ఎంపీ డీకే అరుణ అభివర్ణించారు. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ పార్టీ దేశంలో చేసిన అరాచకాలు, ప్రజలపై సాగించిన దౌర్జన్యాల గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. నాడు పేదలపై అకృత్యాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ, నేడు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక న్యాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన సొంత అజెండాను దేశంపై రుద్దేందుకే గతంలో రాజ్యాంగ సవరణలు చేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడిచిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు రాజ్యాంగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ఆదరణ, కీర్తి ప్రతిష్టలను చూసి రాహుల్ గాంధీ ఓర్వలేకపోతున్నారని డీకే అరుణ ధ్వజమెత్తారు. "ఆపరేషన్ సిందూర్" ద్వారా భారతదేశ శక్తి సామర్థ్యాలను పాకిస్థాన్‌కు రుచి చూపించామని ఆమె గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీని విమర్శించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముందుగా ఎమర్జెన్సీ కాలం నాటి కాంగ్రెస్ దురాగతాల గురించి మాట్లాడాలని ఆమె హితవు పలికారు.

## ఇకపై ఏడాదికి రెండుసార్లు 10th ఎగ్జామ్స్ : సీబీఎస్ఈ



సీబీఎస్ఈ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పదవ తరగతి పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ విధానం 202627 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానుందని పేర్కొంది. మొదటిసారి నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుందని, రెండవసారి జరిగే పరీక్షలు ఆప్షనల్ అని తెలిపింది. రెండు సాధించిన మంచి స్కోర్ ను పరిగణలోకి తీసుకుంటామని సీబీఎస్ఈ వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారు. అయితే ఈ విధానం ద్వారా బోర్డుపై మరింత భారం పడనుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ప్రజాస్వామ్యానికి చీకటియుగం 'ఎమర్జెన్సీ'.. కేంద్ర క్యాబినెట్

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఎమర్జెన్సీ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన క్యాబినెట్.. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ చేసిన మరో తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం పుణె, ఆగ్రాలలో పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

* ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ (CIP)లో భాగంగా రూ.111.5 కోట్లతో దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని ఆగ్రాలో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
* పుణె మెట్రో రైలు విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,626 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
* ఝార్ఖండ్‌లోని ఝరియా బొగ్గు



గనుల నిర్వాసితుల పునరావాసానికి (ఝరియా మాస్టర్ ప్లాన్) రూ.5,940 కోట్లు కేటాయించింది. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన జీవనోపాధి మార్గాలు చూపడం వంటివి ఇందులో ఉన్నాయి.

* శుభాంశు శుక్లాతో కూడిన వ్యోమగాముల బృందం విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ చేసిన తీర్మానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 140కోట్ల భారతీయుల ఆశయాలను ఆయన మోసుకెళ్లారని, ఈ సందర్భంగా శుభాంశుతోపాటు ఇతర వ్యోమగాములకు అభినందనలు తెలిపింది.
* ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన బాధితులకు సంఘీభావంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన క్యాబినెట్.. వారి త్యాగాలను గౌరవించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఈ ఏడాదితో సంవిధాన్ హత్యా దివాస్‌కు 50ఏళ్లు పూర్తైందని పేర్కొంది.



## జులై 3 నుంచి అమర్ నాథ్ యాత్ర.. పటిష్ట భద్రతా ఏర్పాట్లు

జులై 3 నుంచి ప్రారంభం కానున్న అమర్ నాథ్ యాత్రకు మల్టీ లేయర్ (బహుళ అంచెల భద్రత) కల్పించనున్నట్లు కశ్మీర్ పోలీస్ చీఫ్ వికే. బిర్డి తెలిపారు. ఈ సంవత్సరం అమర్‌నాథ్ యాత్రకు జమ్మూ కశ్మీర్ పోలీ సులు, భద్రతా దళాలు అన్ని ఏర్పాట్లు చేశాయి. గత సంవత్సరంతో పోలిస్తే, ఈ సారి యాత్రను సురక్షితంగా సజావుగా చేయడానికి బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేశామని కశ్మీర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అనంత్‌నాగ్ లో విలేకరులతో చెప్పారు.

**38 రోజుల పాటు యాత్ర**

నున్వాన్ బేస్ క్యాంప్ నుంచి పహల్గాం వరకు ఉండే ప్రాంతాన్ని కశ్మీర్ పోలీస్ చీఫ్ బిర్డి సందర్శించి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. 38 రోజుల తీర్థయాత్రకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను జోనల్‌తో సహా వివిధ స్థాయిలుగా విభజించామని యాత్రకు ముందు బుధవారం భద్రతా కసరత్తులు జరిగాయని ఐజీపీ తెలిపారు. ఏదైనా అత్యవసర సమయంలో అప్రమత్తత, సంసిద్ధతను మెరుగుపరచడం లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యాత్ర మార్గాల్లోని శిబిరాలు, రోడ్లు అంతర్గత విభాగాలు వంటి ప్రతి ప్రదేశంలో క్షుణ్ణంగా పరిశీలన చేపట్టారు.

*** స్థానికుల మద్దతు కచ్చితంగా ఉంటుంది**

భద్రతా దళాలు అప్రమత్తంగా ఉంటూనే ఏదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. యాత్రకు స్థానిక మద్దతు గురించి అడిగినప్పుడు, స్థానిక ప్రజల మద్దతు లేకుండా యాత్ర ఉండదన్నారు. స్థానికుల సహాయం, మద్దతు కారణంగా ఈ యాత్ర విజయవంతం అవుతుందన్నారు. ఈసారి కూడా యాత్రికులను స్వాగతించడానికి వారికి సాధ్యమైన సహాయం అందించడానికి ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని ఐజీపీ అన్నారు. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్, అనంత్‌నాగ్ ఖాజిగుండ్, శ్రీనగర్‌లోని పంథా చౌక్, ఉత్తర కశ్మీర్‌లోని బందిపోరా జిల్లాలోని సుంబల్ లలో భద్రతా దళాలు డ్రిల్స్ నిర్వహించాయి.

## 'కొందరికి మోదీనే తొలి ప్రాధాన్యం'.. థరూర్‌కు ఖర్గే చురకలు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ .. మోదీ సర్కారుకు అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పరోక్షంగా థరూర్‌కు చురకలు అంటించారు. ఓ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడుతూ..తమకు దేశమే తొలిప్రాధాన్యమని తర్వాతే పార్టీ అని అన్నారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో బాధితుల వైపు కాంగ్రెస్ నిలబడిందని పేర్కొన్నారు. కానీ కొందరు నేతలకు మాత్రం పార్టీ కంటే ప్రధాని నరేంద్ర మోదీనే ప్రాధాన్యమని మండిపడ్డారు. శశి థరూర్‌కు ఆంగ్ల భాషపై మంచిపట్టు ఉందని ఖర్గే ప్రశంసించారు. తనకు ఇంగ్లీష్ సరిగ్గా చదవడం రానందున.. థరూర్ భాష బాగుండడం వల్లే ఆయనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిని చేశామన్నారు. కొందరు నేతలు పార్టీ పద్ధతులను మరిచి..చేసే పనులు, వ్యాఖ్యలను మనం ఏమి చేయగలమని ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలపై థరూర్ సోషల్ మీడియా






వేదికగా స్పందిస్తూ.. ''ఆకాశం ఎవరికీ చెందదు.. రెక్కలు మీవి.. ఎగరడానికి ఎవరినీ అనుమతి అడగొద్దు'' అని రాసుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీని ప్రశంసిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఓ ఆంగ్ల పత్రికలో వ్యాసం రాశారు. శశిథరూర్ రాసిన వ్యాసాన్ని ప్రధాని కార్యాలయం సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అందులో ప్రపంచవ్యాప్తంగా దేశం ఒంటరిగా ఉందంటూ మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు విరుద్ధంగా ఆయన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత జరిగిన దౌత్యపరమైన కృషి జాతీయ సంకల్పం, ప్రభావవంతమైన వ్యక్తీకరణకు రుజువుగా ఆయన పేర్కొన్నారు. ఇది మన విదేశాంగ విధానానికి కీలక ఘట్టాన్ని అందించిందని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై పలువురు కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పించారు.

## ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి ఎఫ్-35: 10 రోజులు దాటినా ఎగరని ఫైటర్‌జెట్

బ్రిటన్‌కు చెందిన శక్తిమంతమైన ఫైటర్ జెట్ ఎఫ్35బి విమానం ఒకటి 10రోజులుగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో మొరాయిస్తూ నిలిచిపోయింది. దీనికి మరమ్మతులు నిర్వహించేందుకు దాదాపు 40 మంది నిపుణల బృందం త్వరలో తిరువనంతపురం చేరుకోనుంది. ఒకవేళ అది తిరిగి ఎగరడం సాధ్యంకాని పక్షంలో ఎయిర్ లిఫ్ట్ చేసి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. బ్రిటన్ వాయుసేనకు చెందిన వ్యక్తులు వచ్చేందుకు అవసరమైన దౌత్యపరమైన ప్రక్రియలు జరుగుతున్నాయి. ఈ విమానం ఉంచడానికి భారత వాయుసేన హ్యాంగర్‌ను ఆఫర్ చేసినా.. బ్రిటన్ తిరస్కరించినట్లు ఇండిపెండెంట్ పత్రిక పేర్కొంది. దీంతో బహిరంగ ప్రదేశంలోనే దీనిని ఉంచి సీఐఎస్ఎఫ్ సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశారు. ఇక ఈ విమానం పార్కింగ్ చేసినందుకు ఫీజు వసూలుచేయాలని తిరువనంతపురం ఎయిర్ పోర్టు నిర్ణయించింది. ఈ విషయాన్ని బ్రిటిష్ అధికారులకు కూడా వెల్లడించింది. ఎంత మొత్తం అనేది ప్రభుత్వం నిర్ణయించనుంది.

**ఆన్‌లైన్‌లో యాడ్..?**



ప్రపంచంలో శక్తిమంతమైన ఫైటర్‌జెట్‌గా చెప్పుకొనే ఎఫ్35 నిస్సహాయంగా కేరళలో ఉండిపోవడం తీవ్రంగా ట్రోలింగ్‌కు గురవు తోంది. ఈ విమానం ఫొటోతో ఓఎల్ఎక్స్‌లో పోస్టు చేసి.. 4 మిలియన్ డాలర్లకు విక్రయానికి ఉంచినట్లు ఓ స్క్రీన్‌షాట్ సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తోంది.

జూన్ 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత కేరళ తీరం సమీపంలో ఎఫ్35 విమానంలో సమస్య మొదలైంది. దీంతో తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. దీనికి మరమ్మతులు చేయడానికి అదే రోజు రాత్రి ఏడబ్ల్యూ101 మెర్లిన్ హెలికాప్టర్‌లో నిపుణులు వచ్చారు. వారు మరమ్మతులు నిర్వహించినా విమానం మొరాయించింది. దీంతో యూకే నుంచి స్పెషలిస్టులను పిలిపించాలని నిర్ణయించారు.

*** అణ్వాయుధ సామర్థ్య ఎఫ్-35లను కొనుగోలు చేయనున్న బ్రిటన్..**

అణ్వాయుధాలను ప్రయోగించే సామర్థ్యం ఉన్న ఎఫ్35ఏ రకానికి చెందిన 12 విమానాలను కొనుగోలు చేయాలని బ్రిటన్ నిర్ణయించింది. ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత అణు రక్షణ విషయంలో బ్రిటన్ తీసుకొన్న పెద్ద నిర్ణయం ఇది. అమెరికాకు చెందిన కొన్ని అణ్వాయుధాలను బ్రిటన్‌లో భద్రపరిచే అవకాశం ఉంది. వీటిని తీసుకెళ్లడానికి ఈ విమానాలు ఉపయోగపడనున్నాయి. ఈ విమానాలు బ్రిటన్ దళాలను మరింత బలోపేతం చేయడంతోపాటు.. ప్రజలకు రక్షణగా ఉంటాయని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ అభిప్రాయపడ్డారు.



## మీరు గెలిస్తే రైట్.. మేము గెలిస్తే తప్పా

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితా తారుమారు, ఈవీఎంల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీ, మహారాష్ట్రలో మీ అవమానకరమైన ఓటమి బాధ రోజురోజుకూ తీవ్రమవుతుందని అర్థమైందన్నారు. కానీ మీరు ఎంతకాలం ఇలా గుడ్డిగా బాణాలు సంధిస్తుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు గెలిచిన చాలా ప్రాంతాల్లో 7 శాతం నుంచి 11 శాతం ఓటింగ్ పెరిగిందని చెప్పారు. లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య మహారాష్ట్రలోని 25 కంటే ఎక్కువ నియోజకవర్గాలలో ఓటర్ల సంఖ్య 8 శాతానికి పైగా పెరిగిందని వీటిలో చాలా వాటిలో కాంగ్రెస్ లేదా దాని మిత్ర పక్షాలు విజయం సాధించాయని ఫడ్నవీస్ చెప్పారు. పశ్చిమ నాగ్‌పూర్‌లో, ఓటర్ల సంఖ్య 7 శాతం (27,065) పెరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి వియాస్ థాక్రే గెలిచారు. ఉత్తర నాగ్‌పూర్‌లో 7 శాతం పెరుగుదల (29,348 ఓటర్లు) ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి నితిన్ రౌత్ విజయం సాధించారని ఫడ్నవీస్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా రాహుల్ గాంధీ ఆరోపణలను ఖండించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఓడిపోయినప్పుడు మాత్రమే ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించడం దురదృష్టకరమని షిండే అన్నారు. 'కర్ణాటక లేదా తెలంగాణలో వారు గెలిచినప్పుడు, EVMలు ఎన్నికల కమిషన్ మంచివి. కానీ వారు ఓడిపోయినప్పుడు, వ్యవస్థ లోపభూయిష్టంగా మారుతుంది. ఇది మహారాష్ట్రను కించపరిచే కుట్ర' అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక సంక్షేమ పథకాల వల్లే ఈ విజయం సాధ్యమైందని షిండే అన్నారు. వాటిలో లడ్కీ బహిన్ యోజన కూడా ఉందన్నారు.

*** ఇలాంటి ప్రశ్నలు ఓడిపోయిన తర్వాతే వస్తాయ్.. డిప్యూటీ సీఎం అజిత్ పవార్**

డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మాట్లాడుతూ.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ ఓడిపోయిన తర్వాతే వస్తాయి. లోక్‌సభలో వారికి 31 సీట్లు వచ్చాయి. మాకు 17 సీట్లు మాత్రమే వచ్చాయి. గత ఏడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందనే రాహుల్ గాంధీ ఆరోపణలను చర్చించడానికి భారత ఎన్నికల కమిషన్ (EC) ఆయనను వ్యక్తిగత సమావేశానికి ఆహ్వానించింది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి గెలిచిన మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని రాహుల్ గాంధీ పదే పదే ఆరోపించారు.

## ప్రభుత్వం నియంతగా మారితే.. ప్రజలే దాన్ని పడగొడతారు: అమిత్ షా



దిల్లీ: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ హయాంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించిన అత్యవసర పరిస్థితి జాతీయ అవసరం కాదని.. కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యతిరేక మనస్తత్వానికి అది ప్రతీక అని అమిత్ షా ఆరోపించారు. కేవలం తన పదవిని కాపాడుకోవడానికి మాత్రమే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1975, జూన్ 25న అత్యవసర పరిస్థితిని విధించారన్నారు. ఆ సమయంలో దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించివేశారని, న్యాయవ్యవస్థ చేతులు కట్టేశారని, సామాజిక కార్యకర్తలను జైళ్లలో బంధించారని షా పేర్కొన్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడ్డారని తెలిపారు. ప్రభుత్వం నియంతలా మారినప్పుడు, దానిని పడగొట్టే శక్తి ప్రజలకు ఉంటుందని ఈ రోజు అందరికీ గుర్తు చేస్తోందని షా అన్నారు. అత్యవసర పరిస్థితి సమయంలో దేశంలోని ప్రజలు ఎన్నో హింసలు, బాధలు ఎదుర్కొన్నారని అమిత్ షా అన్నారు. అప్పుడు వారు ఎదుర్కొన్న సమస్యలను నేటితరానికి తెలియజేయడానికి భాజపా ప్రభుత్వం జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య రక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పించడమే తమ ఉద్దేశమని అన్నారు. తద్వారా కాంగ్రెస్ వంటి నియంతృత్వ శక్తులు మళ్లీ అటువంటి భయానక సంఘటనలను పునరావృతం చేయకుండా ఉంటాయని వ్యాఖ్యానించారు. సరిగ్గా 50 ఏళ్ల క్రితం 1975 జూన్ 25న ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించారు. అంతర్గత కారణాల వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లినట్లు పేర్కొంటూ నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 కింద ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ కాలంలో దేశ పౌరులు, పత్రికల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ తీవ్ర అణచివేతకు గురయ్యాయి. సుమారు 1.5 లక్షల మంది జైలు పాలయ్యారు. 1977, మార్చి 21 వరకు ఇది కొనసాగింది. దీంతో నాటి పరిస్థితులను వ్యతిరేకిస్తూ.. కేంద్ర ప్రభుత్వం బుధవారం దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించనుంది. కేంద్రమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో దిల్లీలో నేడు 'ప్రజాస్వామ్య యాత్ర'ను ప్రారంభించనున్నారు.

**ఎలాంటి శుభకార్యాలూ తలపెట్టకపోయినా... జ్ఞానాన్ని ప్రసాదించే గురువుని మనసారా పూజించేందుకూ, ముల్లోకాలనూ పాలించే జగన్మాతను కొలిచేందుకూ విష్ణుమూర్తిని స్మరించేందుకూ... అనువైన మాసం ఆషాఢం. ఈ నెలలో దేవతారాధనకు ఇంతటి ప్రాధాన్యం ఎందుకంటే...**



# పర్వదినాల మాసం ఆషాఢం!

ఆషాఢం... తెలుగు సంవత్సరంలో నాలుగో నెల. పౌర్ణమినాడు చంద్రుడు ఉత్తరాషాఢ, పూర్వాషాఢ నక్షత్రాల్లో సంచరించడం వల్లే ఈ మాసానికి ఆషాఢం అని పేరు. మిగిలిన నెలలతో పోలిస్తే ఆషాఢాన్ని శూన్య మాసంగా పరిగణిస్తారు. ఎలాంటి శుభకార్యాలూ తలపెట్టరు. అయితే, పూజా కార్యక్రమాలకూ, దేవతారాధనకూ ఇది సరైన సమయమని అంటారు. ఈ నెలలో సూర్యభగవానుడు మిథునరాశి నుంచి కర్కాటకంలోకి ప్రవేశించడం వల్ల ఉత్తరాయణపుణ్యకాలం పూర్తయి, దక్షిణాయనం ఆరంభమవుతుంది. అలాగే, ఈ నెలలో ఎలాంటి పర్వదినాలు ఉంటాయంటే...

### ఆషాఢ శుద్ధ విదియ

జగన్నాటక సూత్రధారి అయిన ఆ మహావిష్ణువు జగన్నాథుడిగా కొలువుదీరి... సుభద్ర, బలభద్రులతో కలిసి దర్శనమిచ్చే అరుదైన క్షేత్రం పూరీ జగన్నాథుడి ఆలయం. ఈ స్వామికి ఏడాదికోసారి అంగరంగవైభవంగా రథయాత్రను నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ విదియ నాడు ఆ పర్వదినం ఆరంభం అవుతుంది. జగన్నాథుడు తన తోబుట్టువులతో కలిసి ప్రధాన ఆలయాన్ని వీడి, గుండీచా క్షేత్రానికి చేరుకుని, మళ్లీ తిరిగొచ్చే ఈ వేడుక... ఈసారి జూన్ 27తో మొదలై, జులై 5తో ముగుస్తుంది. ఈ రథయాత్రలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ సుమారు ఇరవైలక్షలమందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా. జగన్నాథ రథయాత్రలో పాల్గొంటే అన్ని తీర్థయాత్రలూ చేసిన ఫలితం లభిస్తుందని ప్రతీతి.



### ఆషాఢ శుద్ధ ఏకాదశి

నెలకు రెండు చొప్పున ఏడాదికి ఇరవైనాలుగు ఏకాదశి తిథులు వస్తాయి. వాటిలో ఆషాఢ శుద్ధ ఏకాదశికి 'తొలి ఏకాదశి' అని పేరు. ఈ రోజునే శ్రీమన్నారాయణుడు యోగనిద్రలోకి వెళ్లి మళ్లీ నాలుగు నెలల తర్వాత.. అదీ కార్తిక శుద్ధ ఏకాదశినాడు మేల్కొంటాడట. అందుకే దీన్ని శయన ఏకాదశిగానూ పిలుస్తారు. ఈ నాలుగు నెలల కాలాన్ని పవిత్రంగా పరిగణించడం వల్లే కొందరు తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస దీక్షనూ ఆరంభిస్తారు. ఇక, తొలి ఏకాదశినాడు ఉపవాసం ఉండి, జాగరణ చేసి, మర్నాడు విష్ణుమూర్తిని పూజిస్తే సకల శుభాలూ కలుగుతాయని ఓ నమ్మకం.

### బోనాలు ఆరంభం

ఆషాఢంలోనే తెలంగాణలోని పలు ప్రాంతాల్లో జగన్మాతను భక్తిశ్రద్ధలతో కొలుస్తూ ... ఆ తల్లికి బోనాలు సమర్పించే సంప్రదాయమూ ఉంది. బోనం అంటే... భోజనం అని అర్థం. ఈ సమయంలో అమ్మవారు పుట్టింటికి వస్తుందట. అలా వచ్చే శక్తి స్వరూపిణికి బోనంతోపాటు సారెను సమర్పిస్తే... తన చల్లని చూపులతో అనుగ్రహిస్తుందనీ, ఆయురారోగ్యాలనూ ప్రసాదిస్తుందనీ విశ్వాసం. ఒకప్పుడు తెలంగాణ ప్రాంతంలో ప్రబలిన ప్లేగు మహమ్మారిని అమ్మవారే పారదోలిందట. అందుకు కృతజ్ఞతగా బోనాలు సమర్పించే సంప్రదాయం వచ్చిందనే కథా ప్రాచుర్యంలో ఉంది. ఈ వేడుకలు గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో మొదలై సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి, లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ సాగుతాయి. చివరగా గోల్కొండ కోటలోనే ముగుస్తాయి. డప్పుల మోతలు, గజ్జెల సవ్వళ్లు, పోతురాజుల విన్యాసాలతో వేడుకగా జరిగే ఈ ఉత్సవాలను చూసేందుకు రెండు కళ్లూ చాలవు. ఈ పర్వదినాలతోపాటుగా పలు అమ్మవారి ఆలయాల్లో ఆషాఢ సారె పేరుతో ప్రత్యేక పూజల్ని నిర్వహిస్తారు.

### ఆషాఢ శుద్ధ పూర్ణిమ

తమ జీవితానికి మార్గనిర్దేశం చేసి, ముక్తిమార్గం వైపు నడిపించిన గురువులను పూజించి, సత్కరించే పరమపావనమైన రోజే గురుపూర్ణిమ. మహాభారతాన్ని రచించిన వేద వ్యాసుడు జన్మించిన రోజు కూడా ఇదే కావడంతో దీనికి వ్యాసపూర్ణిమ అనే పేరూ ఉంది. వేదకాలపు సంస్కృతిని నాలుగు భాగాలుగా సంకలనం చేసింది కూడా వ్యాసుడే. ఆ గురుపరంపరకు కొనసాగింపుగా గురుపూర్ణిమనాడు గురువులను పూజించడం తోపాటుగా దక్షిణభారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో పూర్ణిమ వ్రతాన్ని ఆచరించే సంప్రదాయం ఉంది. శివపురాణం ప్రకారం.. ఆదియోగి, ఆదిగురువు అయిన పరమేశ్వరుడు ఆషాఢపూర్ణిమనాడే సప్తర్షులకు జ్ఞానాన్ని బోధించాడట.

# అందంగా... ఉపయోగంగా!

**వంటగదిలో మన పనిని సులువుగా, వేగంగా చేసేందుకు అందుబాటులోకి వచ్చే పరికరాలు ఎన్నో. అయితే, కాస్తంత సృజనాత్మకత ఉండాలే కానీ, దాన్నీ అందమైన, చూడచక్కనైన పరికరాలతో సర్దేయొచ్చు. వంటింటికీ కొత్త లుక్ తేవొచ్చు. అందుకు సాయపడే పరికరాల్లో ఇవి కొన్ని...**







### పిల్లలకు నచ్చేలా...

పండ్లు, కూరగాయలు తినటానికి రుచిగా ఉన్నా సరే... చూడ్డానికి రోజూ ఒకేలా ఉంటే బోర్ కొట్టేస్తుంది. అలాకాకుండా, ఆకర్షణీయంగా ఉండే ఈ 'సలాడ్ ఫోర్క్'లను తీసుకురండి. రంగురంగులుగా, ముద్దుగా ఉండే ఈ ఫోర్క్‌లు వాళ్లకు భలే నచ్చేస్తాయి. పైగా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేసినవి కూడా. కాబట్టి, ఆందోళనా అక్కర్లేదు. వీటితో రోజూ తినేకంటే రెండు పండ్ల ముక్కలు ఎక్కువ తినేస్తారంటే నమ్మండి.

### చాపింగ్ బోర్డే కానీ...

మామూలు చాపింగ్ బోర్డ్‌కీ దీనికీ తేడా ఏంటి? అంటారా... ఉంది. రెండు వైపులా మృదువుగా ఉంటుంది కాబట్టి, దీన్ని ఎటువైపు అయినా వాడుకోవచ్చు. అంతేకాదు, అల్లం, వెల్లుల్లి, క్యారెట్ వంటివి తరుముకునేలాంటి గరుకు నిర్మాణమూ దీన్లో ఉంటుంది. పైగా 360 డిగ్రీల్లో తిరుగుతుంది కాబట్టి, ఓ డెకరేటివ్ పీస్‌లానూ పెట్టొచ్చు, కావాలంటే గోడకీ తగిలించుకోవచ్చు. అందం, ప్రయోజనం రెండూ అన్నమాట.



### పువ్వులు కావు...

చూడ్డానికి తులిప్ పూలలా అందంగా ఉన్నాయి కదా! కానీ, ఇవి డిటాచబుల్ స్పాంజ్ బ్రష్‌లు. సింక్, పొడవుగా ఉండే కప్‌లు, పాలడబ్బాలు... ఇలా అన్నింటినీ శుభ్రం చేసుకోవచ్చు. శుభ్రతకు అందమూ తోడైందన్నమాట.

### స్పూన్లకి ప్రత్యేకమివి...

స్పూన్లు, ఫోర్క్‌లు... వంటివి శుభ్రం చేశాక, వాటిని అన్ని పాత్రల్లోనూ కలిపేయకుండా, ప్రత్యేకంగా ఉంచేందుకు వచ్చినవే ఈ 'స్పూన్ డ్రైనర్ బాస్కెట్'లు. వీటి అడుగుభాగంలో నీళ్లు వెళ్లిపోయేలా అవుట్‌లెట్ ఉంటుంది. ఒక్క స్పూన్లకే కాదు, బ్రష్‌లూ, పేస్ట్‌లూ, పూలూ... వంటివీ వీటిలో స్టోర్ చేసుకోవచ్చు. ఆకర్షణీయంగా ఉండటమే కాదు, మల్టీ పర్పస్‌గానూ ఉపయోగపడతాయి.






# టాలీవుడ్‌లో కనిపించని బేబమ్మ


టాకీస్: ఉప్పెన సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది ఈ వయ్యారి. బ్యాక్ టూ బ్యాక్ హిట్ సినిమాలతో ఆకట్టుకుంది. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో హ్యాట్రిక్ హిట్స్ ఖాతాలో వేసుకుంది ఈ వయ్యారి. తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. అయితే వరుసగా మూడు హిట్స్ ఖాతాలో వేసుకున్న ఈ వయ్యారి.. ఆ తర్వాత ఆమె కెరీర్ ఊహించని విధంగా మారిపోయింది. వరుసగా హ్యాట్రిక్స్ హిట్స్ అందుకున్న మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, మనమే వంటి సినిమాలు వరుస ప్లాపులు పడ్డాయి. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం జస్ట్ ఫర్ ఛేంజ్ చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాతో అక్కడ బేబమ్మకు మంచి క్రేజ్ వచ్చేసింది. ఇక ఇప్పుడు తమిళంలోనూ అవకాశాలు అందుకుంటుంది. కార్తీ సరసన వా వాతియార్ సినిమాలో నటిస్తుంది. ఇప్పటికే ఈ మూవీ విడుదల కావాల్సి ఉండగా అనుహ్యంగా వాయిదా పడింది. అలాగే తమిళంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తుంది. ఈ మూవీ సెప్టెంబర్ 18న అడియన్స్ ముందుకు రానుంది. వీటితో పాటు జీని అనే తమిళంలో చిత్రంలో నటిస్తుంది. ఇవే కాకుండా బేబమ్మకు తమిళంతోపాటు మలయాళంలోనూ మరిన్ని ఆఫర్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా మరో క్రేజ్ ఛాన్స్ కొట్టేసింది. పృథ్వీరాజ్ సుకుమార్ రూపొందిస్తున్న ఖలీఫా చిత్రంలో ఈ అమ్మడు కనిపించే ఛాన్స్ ఉన్నట్లు టాక్. 2022లోనే ఈ మూవీ ప్రకటన వచ్చినప్పటికీ .. పృథ్వీరాజ్ వరుస సినిమాలతో బిజీగా ఉండడంతో సినిమా ఆలస్యమయ్యింది. ఇక ఇప్పుడు జూలై నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది.


# భారీ సినిమా నుంచి శ్రీలీల అవుట్



**టాకీస్:** ప్రస్తుతం టాలీవుడ్‌లో క్రేజీ బ్యూటీగా దూసుకుపోతుంది అందాల భామ శ్రీలీల. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసి మెప్పిస్తుంది. పెళ్లి సందడి సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కు పరిచయమైంది శ్రీలీల. తొలి సినిమానే దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో చేసింది ఈ చిన్నది. ఆతర్వాత మాస్ మహారాజ రవితేజ హీరోగా నటించిన ధమాకా సినిమాలో హీరోయిన్ గా చేసింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. కానీ ఆ తర్వాత శ్రీలీల చేసిన సినిమాలేవీ బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని సాధించలేకపోయాయి. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు అందుకున్నప్పటికీ ఈ అమ్మడి అనుకున్నంత సక్సెస్ మాత్రం రాలేదు. భగవంత్ కేసరి సినిమా హిట్ అయినప్పటికీ ఆ హిట్ బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. మహేష్ బాబు గుంటూరు కారం సినిమాలో నటించినా కూడా ఆ సినిమా కూడా నిరాశపరిచింది. చివరగా నితిన్ తో రాబిన్ హుడ్ సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా నిరాశపరిచింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటిస్తుంది ఈ అమ్మడు. అలాగే అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న లెనిన్ అనే సినిమాలోనూ హీరోయిన్ గా నటిస్తుంది. మొన్నామధ్య ఈ సినిమా నుంచి పోస్టర్ ను కూడా విడుదల చేశారు. అయితే ఇప్పుడు అఖిల్ సినిమా నుంచి శ్రీలీల తప్పుకుందని తెలుస్తుంది.

# సుమంత్ సినిమాను మెచ్చుకున్న మహేశ్






**టాకీస్:** మహేష్ బాబు ఎంత పెద్ద స్టార్ హీరోనో అంతే మంచి మనిషి.. సాయంలోనే కాదు తన సినిమాలతో పాటు పక్కవారి సినిమాలను కూడా ఎంతో సపోర్ట్ చేస్తూ ఉంటారు. చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా తన సపోర్ట్ అందిస్తూ ఉంటారు. ఇప్పటికే మహేష్ బాబు ఎన్నో సినిమాల టైటిల్స్, టీజర్లు, సాంగ్స్ ను రిలీజ్ చేశారు. అలాగే తాను చూసిన సినిమా ఏదైనా మంచిగా అనిపిస్తే వెంటనే సోషల్ మీడియా వేదికగా ఆ సినిమా టీమ్ కు అభినందనలు తెలుపుతారు మహేష్. ఈ క్రమంలోనే ఇప్పుడు ఆయన ఓ ఎమోషనల్ డ్రామా పై ప్రశంసలు కురిపించారు. ఇటీవలే కుబేర సినిమా పై ప్రశంసలు కురిపించిన మహేష్ తాజాగా మరో సినిమాను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ సినిమా ఏదంటే.. ఇటీవల విడుదలై మంచి రెస్పాన్స్ సొంతం చేసుకున్న సినిమాల్లో అనగనగ సినిమా ఒకటి. సుమంత్, కాజల్ చౌదరి జంటగా నటించిన ఈ సినిమా ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కింది. ఈ సినిమాలో సుమంత్ తన నటనతో ఆకట్టుకున్నాడు. ఈ సినిమా డైరెక్ట్ గా ఓటీటీలో విడుదలైంది. తండ్రి కొడుకు మధ్య ఉండే ఎమోషనల్ బాండ్ ను చక్కగా చూపించారు. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు తమ అభిప్రాయాన్ని ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తాజాగా మహేష్ బాబు కూడా ఈ సినిమా పై ప్రశంసలు కురిపించాడు.

# శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న మంచు విష్ణు






**టాకీస్:** ప్రముఖ సినీ నటుడు, నిర్మాత మంచు విష్ణు 12 జ్యోతిర్లింగాల దర్శన యాత్రను పూర్తి చేశారు. ఈ యాత్రలో భాగంగా 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం మల్లికార్జున స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఈ విషయాన్ని మంచు విష్ణు తన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు ఫ్యామిలీ ప్రెస్టీజియస్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు నటుడు మంచు విష్ణు. భక్తిరస చిత్రంగా రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. మంచు విష్ణు గత కొంతకాలంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న జ్యోతిర్లింగాలను సందర్శిస్తూ వస్తున్నారు. ఈ యాత్రలో భాగంగా ఆయన కేదార్‌నాథ్, రామేశ్వరం, సోమనాథ్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించారు. ఇక 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకోవడంతో ఆయన 12 జ్యోతిర్లింగాల యాత్ర పూర్తయింది. తాజాగా ఈ విషయాన్ని మంచు విష్ణు వెల్లడించారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో దర్శనం పూర్తవడంతో, పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శించుకోవాలన్న తన కోరిక నెరవేరిందని విష్ణు ఆనందం వ్యక్తం చేశారు. “నా మనసు నిండిపోయింది. నా ఆత్మ ఆశీర్వదించబడినట్లు అనిపిస్తుంది. జీవితం ప్రస్తుతం సానుకూలత, కృతజ్ఞత మరియు శాంతితో నిండి ఉంది” అని ఆయన ట్వీట్ చేశారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ‘కన్నప్ప’ చిత్రం తన హృదయానికి చాలా దగ్గరైనదని, ఈ సినిమా కథ తాను ప్రస్తుతం అనుభవిస్తున్న స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. హర్ హర్ మహాదేవ్! అంటూ ఆయన తన ఎక్స్ ఖాతాలో రాసుకోచ్చారు.

# జార్జియా షెడ్యూల్ కంప్లీట్ చేసుకున్న ‘అఖండ 2’




**టాకీస్:** నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘అఖండ 2’ (తాండవం). బ్లాక్ బస్టర్ సినిమా ‘అఖండ’ చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్ జార్జియాలో పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా జార్జియా షెడ్యూల్‌ని కూడా చిత్రబృందం పూర్తి చేసుకున్నట్లు సమాచారం. జార్జియా షెడ్యూల్ అనంతరం అఖండ టీమ్ రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక ఎపిసోడ్‌లను చిత్రీకరించబోతుంది.

14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, యంగ్ హీరో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నారు. బాలయ్య మరోసారి అఘోరి పాత్రలో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## పాండ్యతో డేటింగ్‌పై
# స్పందించిన నటి ఇషా



టాకీస్: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యతో బాలీవుడ్ నటి ఇషా గుప్తా డేటింగ్‌లో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఎట్టకేలకు స్పందించింది నటి ఇషా గుప్తా. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఇషా గుప్తా మాట్లాడుతూ.. అవును, మేమిద్దరం కొంతకాలం మాట్లాడుకున్నాం. కానీ మేము డేటింగ్ చేశామని నేను అనుకోవడం లేదు. కొన్ని నెలల పాటు మా మధ్య సంభాషణలు జరిగాయి. బహుశా ఇది జరగవచ్చేమో, లేదా జరగకపోవచ్చేమో అన్న దశలో ఉండేవాళ్లం. మేం డేటింగ్ దశకు



చేరుకోకముందే అది ముగిసిపోయింది. కాబట్టి దాన్ని డేటింగ్ అని చెప్పలేం అని వివరించారు. తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని, మనస్పర్థలు కూడా రాలేదని.. అయితే మేము కలవడం అనేది రాసిపెట్టిలేదని తెలిపారు. మేమిద్దరూ చాలా భిన్నమైన వ్యక్తులమని, అందుకే విషయాలు ముందుకు సాగలేదని ఇషా చెప్పుకోచ్చారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.